# నీ అత్తరు బుడ్డిని పగుల గొట్టావా?[1]

## మత్తయి 26:6-13; మార్కు 14:3-9; యోహాను 12:1-8, పరిశీలన

మత్తయి 26, మార్కు 14, యోహాను 12లో దాఖలు చేయబడిన సంభవంలాంటివి కొన్ని ప్రభువైన యేసును నిజంగా తాకాయి. సిలువ కేవలం కొద్ది దినాలలోపే ఉంది, ఆయన హృదయము భారమైంది. శత్రువుల ద్వేషం ఒకవైపు, అగుపరచబడిన ఈలాటి ప్రేమ మరియొకవైపు మధ్యలో ప్రభువు భయంకరమైన ఘర్షణలో కొట్టుమిట్టాడారు(మార్కు 14:1, 2). జీవితమంతా యివ్వడంలోనే గడిపిన ఆయనకు అభినందన అరుదుగా దొరికింది. కారణమేమైయున్నా, తన పరిచర్యలో అధికమైన పొగడ్తను యిచ్చేలా ప్రభువు అభిముఖుడై ఉన్నారు.

"చివరి – రాత్రి – భోజనానికి – తరువాతదని"[2] కొందరు దీన్ని పేర్కొనే సమయంలో ఈ సంఘటన జరిగింది. చివరి రాత్రి భోజనాన్ని గూర్చి మనం విన్నాం: చివరి రాత్రి భోజనానికి తరువాత విషయంతో కూడా మనం పరిచయం కలిగియుండాలి. రెండింటిలోను మనం స్మరించే విషయముంది. చివరి రాత్రి భోజనాన్ని ప్రభువు స్థాపించుతూ, "నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడి" అని చెప్పారు (లూకా 22:19). చివరి రాత్రి భోజనానికి తరువాత దానిలో "సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మార్కు 14:9).

ఇంతలో, అది మరియ ప్రభువు పాదములకు అత్తరు పూసిన సంఘటన అని నీవు గుర్తు పట్టి యుండవచ్చు. అది సువార్త కథలలో రమ్యమైనది. మొదటిగా, పాత్రలను, పరిస్థితులను మనస్సునకు తెచ్చుకుందాం; అటు తరువాత వర్తింప జేసుకొందాం. ప్రాథమికంగా మనం మార్కు వర్ణనను ఉపయోగించుదాం,[3] మిగిలిన వివరాల కొరకు యోహాను వద్దకు వెళ్లుదాం.[4]

### వర్ణన

"ఆయన బేతనియలో కుష్ఠరోగియైన సీమోను ఇంట భోజనమునకు కూర్చుండి యున్నప్పుడు" అంటూ కథ ఆరంభమౌతుంది (మార్కు 14:3ఎ). పస్కాకొరకు ప్రభువు యెరూషలేమునకు వచ్చారు. యోహాను ప్రకారం, దానికి "ఆరు దినములు ముందుగా" వచ్చారు (యోహాను 12:1). క్రీస్తు అలవాటును బట్టి, యెరూషలేమునకు రెండు మైళ్ల దూరంలో ఉన్న బేతనియ అనే గ్రామంలో ఆయన కాలం గడుపుతున్నారు.

బేతనియలో ఉండగా, ఆయన మామూలుగా మరియ, మార్త, లాజరు అనే వారిని ఆయన దర్శించేవారు (లూకా 10:38; యోహాను 11:1, 5; 12:1 చూడు); "కుష్టరోగియై

యుండిన సీమోను” ఆహ్వానాన్ని యిచ్చాడు. సీమోను శుద్ధీకరింపబడిన కుష్ఠరోగియని మనం నిరభ్యంతరంగా భావించవచ్చు. ఎందుకంటె ఆ వ్యాధితో బాధపడేవారితో యూదులు సహజంగా కలిసి భోజనం చేయరు. సీమోను తప్పక ప్రభువుచే బాగుచేయబడి యుండాలి. ఆ భోజనపు విందులో ఉన్నవారిలో లాజరు అతిథిగాను (యోహాను 12:2); మార్త ఉపచారము చేయునదిగాను (యోహాను 12:2; లూకా 10:40 చూడు); మరియ (యోహాను 12:3); క్రీస్తు శిష్యులును (మత్తయి 26:8) ఉండిరి.

దృశ్యాన్ని చిత్రించు: అతిథులు తమ ఎడమ మోచేతులమీద బల్లచుట్టు ఆనుకొని (మార్కు 14:3బి) తమ కుడిచేతులతో భోజనం చేస్తున్నారు. ఆ విందు సమయంలో, సీమోను తాను ప్రభువుచే బాగు చేయబడినట్టు తన చేతులను ప్రదర్శించియుండవచ్చు. వీరందరిలో అతి ముఖ్యమైన వ్యక్తి లాజరైయుండవచ్చు. “చనిపోయి బ్రతికింప బడడమంటే” ఎలాగుంటుందో అని అతడు అనియుండవచ్చు. మరణించడంలోని ఆవేదన, దాన్నికప్పిన చీకటిని గూర్చి అతడు చెప్పియుండవచ్చు.[5] “లాజరు, బయటికి రమ్ము” (యోహాను 11:43), “అనేది కొంత దూరం నుండి వినిపించింది”, ప్రాణం నా మృతదేహములోనికి వచ్చింది! అని లాజరు అంటే, ఆ భోజనశాల నవ్వుతో నిండి యుండవచ్చు. అప్పుడు లాజరు సమాధిలోనుండి బయటికి వచ్చాడు, అయినా ప్రేతవస్త్రములచే దట్టంగా యింకా కప్పబడియున్నాడు. అది ఎంతటి మంచి సాయం కాలమైయుంటుందో!

ఇదంతయు జరుగుచుండగా, నెమ్మదిగానున్న మరియ గమనిస్తుంది. వడ్డించడంలో ఆమె మార్తకు సహాయపడియుండవచ్చు (లూకా 10:40 చూడు), కాని ఆమె దృష్టి ప్రభువుపై మళ్లినట్టుంది. ఆమె హృదయం ప్రేమతో పొంగిపొర్లింది. ఆమె ప్రభువునకు కృతజ్ఞత అభినందన, తన సహోదరుని బ్రతికించినందుకు కనుపరచాలని పూనుకొంది. ఒకవేళ, ఆమె మంచిగా మాట్లాడడం చేతకాక పోవచ్చు. అలాటప్పుడు తాను ఎలా ఫీలౌతుందో ఎలా కనుపరచాలి? ఒక ఆలోచన వచ్చింది. ప్రత్యేకమైన సందర్భం కొరకు దాచియుంచిన “మిక్కిలి విలువగల అచ్చ జటామాంసి” యింటిలో ఉంది (మార్కు 14:3; యోహాను 12:3).

అచ్చ జటామాంసి[6] అనేది బహు వెలగలది, రోజా ఎరుపురంగులో ఉండే అత్తరు బహు అరుదైన చెట్టు మూలికలనుండి తయారవుతుంది. దూరదేశం నుండి దిగుమతి అవుతుంది. సమాధి కొరకు మృతదేహాలను సిద్ధపరచడానికి మామూలుగా వాడబడుతుంది.[7] ఆ అత్తరు మిక్కిలి వెలగల బుడ్డిలో ఉంటుంది. ఆ అత్తరు బుడ్డి పశ్చిమ ఐగుప్తునుండి దిగుమతి చేయబడిన మార్బల్‌తో చేయబడింది.

మరియ దాన్ని తీసికొనివచ్చుటకు పరుగెత్తి, తన చేతులతో దాచి, భోజనశాలకు దాన్ని తెచ్చింది. “ఆ అత్తరు బుడ్డి పగుల గొట్ట”డంతో, ఆ విందులో కొనసాగుతున్న సంభాషణ ఆగిపోయింది (మార్కు 14:3) ఆ బుడ్డిపైనున్న మూత తీసి ఆయన తలమీద కొన్ని బొట్లు పడేలా ఆమె వదలియుంటే, అక్కడ కూర్చుండినవారు ఆశ్చర్యపడక పోయేవారు (లూకా 7:46 చూడు), అయితే ఆమె బుడ్డినే పగులగొట్టింది.[8] తన అభినందనను, ప్రేమను వ్యక్తం చేయడానికి ఆమె ఏ మాత్రం వెనుకాడలేదు.

మార్కు ప్రకారం, ఆమె ఆయన తలపై నూనే పోసింది (మార్కు 14:3), యోహానైతే, ఆమె తన పాదములకు నూనె పూసినట్టు అన్నాడు (యోహాను 12:3ఎ). "తలనుండి పాదములవరకు" ఆమె నూనె పోసిందని నేడు మనం అనవచ్చు. ఆమె "ఒక సేరున్నర యెత్తు తీసికొని, యేసు పాదములకు పూసి తన తలవెంట్రుకలతో ఆయన పాదములు తుడిచెను; ఇల్లు అత్తరు వాసనతో నిండెను" (యోహాను 12:3బి).[9]

అప్పుడు, ఆమె సాహసముచే దిగ్భ్రాంతులైనవారు నోళ్లు తెరిచారు:

> అయితే కొందరు కోపపడి – ఈ అత్తరు ఈలాగు నష్టపరచనేల? ఈ అత్తరు మున్నూరు దేనారములకంటే ఎక్కువ వెలకమ్మి,[10] బీదలకియ్యవచ్చునని చెప్పి ఆమెను గూర్చి సణుగుకొనిరి (మార్కు 14:4, 5).

యోహాను ప్రకారం, ఆలాటి విమర్శ లేపినవాడు యూదా (యోహాను 12:4, 5).

దేనారము ఒక సాధారణమైన కూలివానికి ఒక దినపు కూలి (మత్తయి 20:2). మూడువందల దేనారాలంటే, ఆలాటి ఒక కూలివానికి సంవత్సర ఆదాయమని మారుగా చెప్పవచ్చు.[11] నీవు ఏ రూపంగా ఆలోచించినా, ఆ అత్తరు చాల ఎక్కువ మొత్తమే అయ్యుంటుంది![12] విమర్శకులకు, యిది భయంకరమైన వ్యర్థంగా కన్పించింది.

ప్రభువు తమతో ఏకీభవిస్తారని వారు ఎదురుచూచి యుండవచ్చు. ఎందుకంటె, ప్రభువు విలాసాలకు దూరంగా ఉండి బహు సామాన్యమైన జీవితాన్ని జీవించారు. దుర్వ్యయాన్ని ఆయన నిరసించారు.[13] పైగా, పేదలపై కనికరం చూపడాన్ని ప్రోత్సహించారు.[14] ప్రభువు ఆమెపై తప్పు మోపుతారని వారు తలంచియుండవచ్చు. దానికి బదులు, ఆయన ఆమెను మెచ్చుకున్నారు:

> అందుకు యేసు ఇట్లనెను – ఈమె జోలికిపోకుడి; ఈమెను ఎందుకు తొందరపెట్టుచున్నారు? ఈమె నాయెడల మంచికార్యము చేసెను. బీదలు ఎల్లప్పుడు మీతోనేయున్నారు,[15] మీకిష్టమైనప్పుడెల్ల వారికి మేలు చేయవచ్చును;[16] నేను ఎల్లప్పుడును మీతో నుండను. ఈమె శక్తికొలదిచేసి, నా భూస్థాపన నిమిత్తము నా శరీరమును ముందుగా అభిషేకించెను (మార్కు 14:6–8).

వారికి తెలియని ఒక విషయం ప్రభువుకు తెలుసు: తన గడియ సమీపించిన సంగతి ఆయనకు తెలుసు (యోహాను 12:23; 13:1; 17:1). కొద్ది దినాలలోనే ఆయన సిలువపై వ్రేలాడబోతున్న సంగతి ఆయనకు తెలుసు, తన కార్యం దేన్ని సూచిస్తుందో అన్న సంగతిని మరియ గ్రహించియుండదని నా అనుమానం. ఆమెకు సంబంధించినంత మట్టుకు, ప్రేమ కృతజ్ఞతలు తటాలున పొంగిపొరలివచ్చి వాటిని కేవలం అలా వ్యక్తపరచింది. ఏదియెలాగున్నా, అందులో ఆయన ప్రత్యేకతను గుర్తించాడు: ఆమె ఆయన దేహాన్ని సమాధికొరకు సిద్ధపరచింది.

క్రీస్తు ప్రభువు మరణము, సమాధిని గూర్చి ముందుగా ఆలోచించు. సుర్యాస్తమయానికి కొన్ని గంటలు ముందుగా, సబ్బాతు దినారంభానికి కొంచెం ముందుగా

ఆయన చనిపోయారు (లూకా 23:54). అరిమత్తయియ యోసేపు తన సమాధి యొద్దకు ఆయన మృతదేహాన్ని తీసికొని పోయాడు. అతడును నీకొదేమును త్వరగా దానిని అంతిమ క్రియలకు సిద్ధపరచారు, కాని ఆ పని సరిగా చేయడానికి తగినంత సమయం వారికి లభించలేదు.[17] అక్కడ నిలిచి చూస్తున్న కొందరు స్త్రీలు సబ్బాతు దినం తరువాత ఆ పనిని ముగించాలని తలంచి, "తిరిగి వెళ్లి సుగంధ ద్రవ్యములను, పరిమళ తైలములను సిద్ధపరచి, ఆజ్ఞ చొప్పున విశ్రాంతి దినమున తీరికగా ఉండిరి" (లూకా 23:56). ఏదియెలాగున్నా, ఆదివారమున వారు (లూకా 24:1) సమాధిని చూడవచ్చినప్పుడు, ప్రభువు దేహం అందులో లేదు (లూకా 24:2, 3); ఆయన లేచియున్నారు (లూకా 24:6). సబ్బాతుకు ముందుగాని తరువాత గాని సరిగా ఆయన దేహాన్ని సిద్ధపరచడానికి సమయం అందకుండా పోయింది – అయినా ఫరవాలేదు. మరియ ఆయన దేహాన్ని ముందుగానే సిద్ధపరచింది.

ప్రభువు ఆ విషయాన్ని యిలా ముగించుతున్నారు: "సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో,[18] అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రశంసించబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మార్కు 14:9). సువార్త ఎక్కడికి వెళ్లిందో, అక్కడెల్లా స్త్రీ పురుషులు మరియ ప్రేమ కానుకను గూర్చి చదివారు (చదువుతారు). అచ్చమైన జటామాంసి అత్తరు బుడ్డి సువాసన బేతనియలోని యింటిని నింపడం మాత్రమే గాక, అది లోకమంతయు నింపింది.

## వర్తింపు

ఈ కథనుండి మనం నేర్చుకోగల పాఠాలేవి? అనేకములు సూచింపబడ్డాయి. వాటిలో మనం మూడింటిని ఆలోచిద్దాం.[19] ఇవి ఒకదాని మీద మరొకటి ముడిపడి ఉంటాయి, అయినా, అవి విడివిడిగా ప్రస్తావించుటకు తగినవి.

### ప్రేమ తుది లాభాన్ని చూస్తుంది

మొదటిగా, ప్రేమించేవారు అమితంగా వ్యయంచేయడంలో చివరిగా ఏది లాభదాయకంగా ఉండబోతుందో దాన్ని చూస్తారు. ఇది అసంబద్ధంగా వినిపించవచ్చు: అయినా, అమితంగా వ్యయం చేయడంలో మితవ్యయం ఎలా ఉంటుంది? ఉండనేరదు, కాని ప్రేమను వ్యక్తపరచడంలో అది ఉండవచ్చు.

నేను చెప్పేదాన్ని అర్థం చేసికొనడానికి, కొంచెంసేపు ఆ కథలోని రెండు పాత్రధారులను: అంటే మరియ, యూదాలకు గల తారతమ్యాన్ని గూర్చి ఆలోచించు.[20] వారిద్దరు ప్రభువునకు శిష్యులే. వారిద్దరు ఆయనకు సన్నిహితంగానే ఉన్నారు. వారిద్దరు ఆయనతో మాట్లాడారు, ఆయన మాటలను ఆలకించారు. అయినా, వారిద్దరి మధ్య ప్రాథమిక వ్యత్యాసముంది. ఒకరు ఆయనను ప్రేమించగా, మరియొకరు ప్రేమించలేదు. గనుక, వారిలో ఒక వ్యక్తికి, అమితవ్యయం ప్రేమను వ్యక్తపరచడానికి చేసింది; మరి యొకనికి అది వ్యర్థంలా కన్పించింది.

అది వ్యర్థమా? ఆ అత్తరుతో మరియ మరి యింకేమి చేసియుండేది? తన్ను విమర్శించినవారు సూచించినట్టు, దానిని అమ్మి ఆ డబ్బును బీదలకు యిచ్చియుండేది. ఆ పని ఔదార్యాన్ని ప్రకటించేది. "పేదలను జ్ఞాపకం చేసికోమని" మనకు చెప్పారు (గలతీ. 2:10). దానివల్ల లభించే ఫలితమేమిటి? "పేదలు ఎల్లప్పుడు" మీతోకూడా ఉంటారని ప్రభువు స్వయంగా తెలిపారు. లేక ఆమె ఆ అత్తరును తన కొరకు లేక తన కుటుంబం కొరకు దాచుకొని యుండవచ్చు. మనలో కొందరు యిలా ఆలోచించియుండ వచ్చు: "నాకు ఎన్నో అవసరతలు ఉండగా, నేను నా సొత్తును యిచ్చివేయడం ఏమిటి? ప్రక్క యింటి సీమోనుకు క్రొత్త కారు ఉంది. నాకు అది లేదు. నాకు కూడా ఆలాటిది కావాలి!" అలా అనుకొని, ఆమె తన అచ్చ జటామాంసి అత్తరును ఉపయోగించుకోకుండా లేక ఎవరినీ దీవించకుండా ఆలాగే ఉంచుకొనియుండవచ్చు. పై చెప్పబడిన వాటిలో ఆమె ఏమి చేయాలని నిశ్చయించినా, లోకమంతా దానిని కోల్పోయేది. మనమంతా స్ఫూర్తి కలిగించే నిస్వార్థ ప్రేమ యిచ్చిన నిదర్శనాన్ని చూడలేక పోయేవాళ్ళం.

ఒక్క క్షణం, నీ జీవితంలోని ప్రత్యేక సంఘటనను గురించి ఆలోచించు. నీ మనస్సుకు ఏదైనా తట్టిందో? ఆలాంటిదే ఉంటే, అది నీ చుట్టూ ఉన్న అందరూ అతి ప్రాక్టికల్‌గా ఉన్న సమయం కాకపోవచ్చు: "నేనీమధ్యనే కొంత ఆస్తిని అమ్మాను ... లేదా వ్యాపారం లేదా ఒక ఆవు ... నేను నా డబ్బునంతా బ్యాంకులో వేసాను. దానికి వడ్డీ వస్తుందని." కళ్ళనీళ్ళతో ఒక స్త్రీ, "నీవలా చేసి ఉండకూడదు, నిజంగా అలా చేసి ఉండకూడదు" అన్న సందర్భం జరిగి ఉండవచ్చు.[21]

మీలో కొందరు మీ పిల్లలను బడికి పంపడానికి, ఎంత ఖరీదైనా సరే ఆ అత్తరు బుడ్డీలను పగులగొట్టి ఉండవచ్చు.[22] గతంలో కొందరు పురుషులు, స్త్రీలు, ప్రభువు సంఘం కూడుకునే భవనాలను కట్టడానిక తమ అత్తరు బుడ్డీ డబ్బాలను పగులగొట్టి ఉంటారు.[23] అది త్యాగమై ఉండవచ్చు. అందువల్ల వారు దీవెనలను పొందారు.

## ప్రేమలేకుంటే అంతా వ్యర్థమనిపిస్తుంది

ప్రేమ కలిగినవారు చిట్టచివరకు మిగిలే ఆదాయాన్ని చూస్తారు. ప్రేమించని వారు దాన్ని చూడలేరు. అంతేగాక, ప్రేమచూపడం వ్యర్థంగా వారు భావిస్తారు. అపరిమితమైన ఖర్చుతో కూడిన బహుమానాలను గ్రహించడానికి వారికి శక్తి చాలదు.

ఆ విషయాన్ని ప్రధానంగా విమర్శించిన వాని మానసిక స్థితిని గూర్చి యోహాను మనకిట్టి సంగతులను సూచించాడు:

> ఆయన శిష్యులలో ఒకడు అనగా ఆయనను అప్పగింపనైయున్న ఇస్కరియోతు యూదా - యీ అత్తరెందుకు మూడువందల దేనారములకు అమ్మి బీదలకు ఇయ్య లేదనెను. వాడీలాగు చెప్పినది బీదలమీద శ్రద్ధకలిగి కాదు గాని వాడు దొంగయైయుండి, తన దగ్గర డబ్బు సంచియుండినందున అందులో వేయబడినది దొంగిలించుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను (యోహాను 12:4-6).

యూదా పేదలను గూర్చి అక్కరగలవాడు కాదు. ఆ అత్తరు అమ్మి డబ్బు సంచిలో వేస్తే,

అది తనకు అందివస్తుందని అతడు తలంచాడు. మరియ చేసిన అమితమైన ఖర్చు అతనికి వ్యర్థంగా కన్పించిందంటే, అందులో ఆశ్చర్యపడవలసింది ఏదీ లేదు!

విమర్శకులందరికి యూదాకున్న తప్పు ఉద్దేశాలే ఉన్నట్టు మనం నిందమోప కూడదు. కాని యితరులను దృష్టిలో ఉంచుకో కుండా స్వార్థపరమైన భావాలతోనే ఆలోచించే ప్రజలకు అమితమైన ఖర్చుతోకూడిన బహుమతులు వ్యర్థంగానే కన్పించేది వాస్తవం. Abilene Christian Collegeకి నేను పోనారంభించకముందు, నాకు కాబోయే భార్యకు ప్రధానపు ఉంగరాన్ని కొన్నాను. అది ఏ రూపంగాను ఖరీదైనది కాదు. కాని అది లోకంలో నాకున్న డబ్బులో సగం దానికి అయ్యింది. ఆర్థికమైన నా పేదరికానికిని, ఆర్థికమైన నా బాధ్యతలకును, అలా కొన్నది జాగ్రతలేని పని అనుకుంటారేమో ననిపించింది? నేను పెట్టిన పెట్టుబడులలో ఒకవేళ అదే అతి శ్రేష్ఠమైనదేమో.

మత సంబంధంకాని విషయాలలో, ప్రేమను కనుపరచేవాటిని వ్యర్థమైన ఖర్చులని ప్రేమలేని వారు అనుకుంటారు; ప్రభువు పని విషయములోకూడా అదే సత్యం. లాస్ ఎంజిలెస్‌లోని ఒక వృద్ధ స్త్రీ వారంలో ఎక్కువ భాగం భోజనం చేయక పడియుంది, అయితే దేవుని ఆరాధించడమంటే ఆమెకు ప్రాణం. ఆదివారపు ఆరాధనకు ఆమె అరుదుగా రాలేకపోయేది తన బంధుజనులు ఆత్మసంబంధమైన ఉత్సాహాన్ని ఆమెతో పంచుకునేవారు కారు. "నీవు చావబోతున్నా, సంఘ కూడికకు పోయే సమయమైతే, నీవు లేచి వెళ్లతావు కదా?" అని వారిలో ఒకరన్నారు.[24]

ఓక్లహోమా పట్టణంలో ఒక వ్యాపారి సంఘకానుకల విషయంలో బహు ఔదార్యం కలవాడైయుంటాడు. "ప్రభుత్వం అనుమతించేకంటే నీవు అధికంగా యిస్తున్నావు. నీ కానుకలను తోపుదు పరిమితి వరకు తగ్గించుమనేది నా సలహా" అని తన ఎకౌంటెంట్ అన్నాడట. "ఇవ్వడంలో నా ఉద్దేశం (ఆదాయపు పన్ను తోపుడు పరిమితి కాదు) ప్రేమ" అని ఆ సహోదరుడు జవాబిచ్చాడట! ప్రభువు పట్ల గాఢమైన ప్రేమ లేనివారికి, ఆయన విషయంలో చేసే అమితమైన ఖర్చు ఎల్లప్పుడు ఖరీదైనదిగాను బుద్ధిహీనమైనదిగాను కన్పిస్తుంది – అవును, వ్యర్థంగా కూడా కన్పిస్తుంది.

**ప్రేమ అవకాశాన్ని సద్వినియోగం చేసికొంటుంది.**

మన చివరి పాయింట్ చాలా ముఖ్యమయ్యింది: వ్యక్తపరచుకొనడానికి తగిన అవకాశాన్ని ప్రేమ సద్వినియోగం చేసికొంటుంది. ఆలాటి అవకాశం తరచుగా ఒక క్షణంపాటు మనముందు నిలుస్తుంది: అది పోయిందంటే మాత్రం, తిరిగి పొందలేం.

మరియ "నా భూస్థాపన నిమిత్తము నా శరీరమును ముందుగా అభిషేకించెను" అని ప్రభువు తెలిపారు (మార్కు 14:8). ఆ అత్తరు బుడ్డీ తీసికొని రాబోయినప్పుడు, మరియకు మరోరకమైన ఆలోచన వస్తే ఏమైయుండేది? "అపరిమితమైన ఈ ఖర్చు విషయమై నేను మార్తకు ఏం జవాబు చెప్పాలి?" అని ఆమె తలంచియుంటే ఏమి జరిగేది? ఆ ఆలోచనతో ఆ అత్తరు బుడ్డిని తిరిగి అక్కడే పెట్టి తిరిగి వచ్చియుండేది. "ఈ తొందరగల సమయం గతించినతోడనే, మార్త, లాజరు, నేను కలిసి కుటుంబంగా

చర్చించి ఆ అత్తరును గూర్చి తీర్మానిస్తాం. దీని విషయం వారుకూడా అలాగే ఫీలవ్వవచ్చు. ఆ తరువాత ఈ విలువైన అచ్చు జటామాంసిని ప్రభువుకు సమర్పించవచ్చు. ముందు ఈ విందుకానియ్యి" అని కూడా ఆమె సమర్థించుకోవచ్చు. క్రీస్తును సిలువలో చూచినప్పుడు పోగొట్టుకున్న తన అవకాశాన్ని తలచుకుంటే ఎలా ఉండేదో?

ముట్టకుండ, పగులగొట్టకుండ, ప్రభువుకుగాని యితరులకొరకుగాని భద్రం చేయకుండా, మనకొరకే జాగ్రత్తగా దాచుకున్న అత్తరు బుడ్డులుండడం సాధ్యమే, కదా? మన ప్రేమను కృతజ్ఞతను కనుపరచడానికి వచ్చిన అవకాశాలు పోగొట్టుకున్న దాన్ని తలపోస్తూ మనమెన్ని కన్నీళ్లు కార్చవలసి వస్తుందో? నేను తీర్పు చెప్పాలనే ఉద్దేశంతోకాదు గాని, వందలాది సమాధికార్యక్రమాలకు హాజరైన వానిగా "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" లేక "నేను నిన్ను అభినందిస్తున్నా"నని చెప్పలేని జనులు ఎందరో తమ మృతుల పక్షంగా కన్నీళ్లు విడిచినట్టు కన్పిస్తుంది.

దీన్ని కూడా ఆలోచించు: ప్రభువు తిరిగి ప్రత్యక్షమయ్యే సమయానికి యింకా మనం సమయము, తలాంతులు, బలము, సొత్తు అనే అత్తరు బుడ్డులు ఎందరివి పగులగొట్టకుండ ఆలాగే మిగిలి యుంటాయో? తటాలున వాటి విలువ అంతా పడిపోతుందని చెప్పవచ్చు.

## ముగింపు

మీరు నన్ను గమనించియుంటే, వ్యర్థమైన ఖర్చులను నేను ప్రోత్సహించడం లేదు. నీకు లేని డబ్బును ఖర్చు పెట్టుమని కూడా నేను చెప్పడం లేదు. అపరిమితమైన ఖర్చుకు ప్రేమను వ్యక్తపరచుకునే సమయము, స్థలము ఉంది. "ప్రేమ ఎన్నడే లెక్కలు చూచుకోదు; మర్యాదగా యివ్వడంలో ఎంత తక్కువ అనేదాన్ని ప్రేమ ఆలోచింపదు; అత్యంతమైన పరిథులవరకు యివ్వడానికే ప్రేమ కాంక్షిస్తుంది; మరియు, తాను యివ్వగలిగినంత యిచ్చాక, తన బహుమతి చాల అల్పమైనదనే తలంచుతుంది" అని విలియం బార్క్లె రాశాడు.[25]

మితి మించిన ఖర్చుతో ప్రేమించిన అనేక ఉదాహరణలను నీవు తలంచవచ్చు,[26] అయితే దేవుడు మనకిచ్చిన వరము అత్యున్నతమైన ఉదాహరణైయుంది (యోహాను 3:16). మనయెడల తనకున్న ప్రేమనుబట్టి ప్రభువు సహితము వెలను లెక్కించలేదు. ఆయన యిప్పుడు మనవైపు చూచి, "నీవును ఆలాగుననే చేయుము" అని అంటున్నారు (లూకా 10:37).

ముగింపులో, ప్రభువు ఆహ్వానాన్ని యివ్వకోరుతున్నాను. మారుమనస్సు పొందిన విశ్వాసివిగా, నీ విశ్వాసాన్ని ఒప్పుకొని, బాప్తిస్మము పొందు (మార్కు 16:16; అపొ. 2:38). నీవు త్రోవ తప్పిన దేవుని బిడ్డవైతే, నీవు తిరిగి పునరుద్ధరింపబడాలి (అపొ. 8:22; 1 యోహాను 1:9). ప్రభువుకు లోబడడానికి దీనిని జరిగించు – విధేయత ప్రాముఖ్యమైనది (హెబ్రీ. 5:8, 9) – అయితే, దానికంటే ముఖ్యంగా, ఆయన కొరకు నీ ప్రేమ ప్రదర్శనగా దీన్ని జరిగించు (యోహాను 14:15; 1 యోహాను 5:3).

## సూచనలు

[1]ఈ ప్రసంగంలో ఎక్కువ భాగం William S. Banowsky, “Breaking Alabaster Boxes” మీద ఆధారపడింది. వివరాలకు ముందు చూడు. [2]యేసు చేసిన ఆఖరి భోజనమునకు ముందటి భోజనం కాదు. పస్కా పండుగకు ముందు చేసిన భోజనము గూర్చిన రికార్డు. [3]మత్తయి, మార్కు వివరాలు ఒకేలా ఉన్నాయి. [4]నా శ్రోతలనైతే రెండు వాక్య భాగాలను గుర్తించుకోమని చెప్పి, కథను వివరించునప్పుడు వాటిని చదవమంటాను. [5]“మూడవ ఆకాశంలో” పౌలు చూచిన సంగతులు చెప్పనొల్లకున్నందున (2 కొరింథీ. 12:2–4), మరణం తరువాత వివరాలు లాజరు చెప్పకయే పోవచ్చు. [6]The KJV has “spikenard.” [7]లాజరు దేహాన్ని సిద్ధపరచడంలో ఆ అత్తరును ఎందుకు వాడలేదో! వారికి రెండు బుడ్డులుంటే ఒకటి లాజరుకు వాడి ఒకటి మిగిల్చియుండవచ్చు. [8]మృతులను గౌరవించడంలో ఏమి మిగిల్చుకోలేదని సూచించడానికి చనిపోయిన వారి మృత దేహాలకు ఉపయోగించే సుగంధపు పరిమళాలతోపాటు వాటిని కలిగియున్న బాటిల్స్ కూడా సమాధిలో పడవేస్తారు అని Barclay తెలిపాడు. (William Barclay, *The Gospel of Mark*, rev. ed., The Daily Study Bible Series [Philadelphia: Westminster Press, 1975], 326). [9]ఒక బాలుని గూర్చిన కథ నా దగ్గర ఉన్నది. ఆ బాలుడు తన తండ్రియొక్క సుగంధ ద్రావకమును తన గదినిండ చల్లాడు గనుక నేను గదిలోనికి ప్రవేచించినప్పుడు సువాసనతో “నిండియున్నది.” నీకీలాంటి అనుభవముంటే ఉదహరించవచ్చు. [10]KJVలో “పెన్నీలు”, గ్రీకులో ఉపయోగించిన పదం “దేనారములు”.

[11]“ఒక సంవత్సరం కంటె అధికమైన కూలి” అని NIV అంటుంది. [12]ఒక సాధారణమైన కూలివాని సంవత్సరపు కూలి ఎంతో నీ ప్రాంతాన్ని బట్టి లెక్కించవచ్చు. [13]ఉదాహరణకు, 5000 మంది ఆహారం పెట్టిన తరువాత ముక్కలను గంపలకు ఎత్తించారు (మత్తయి 14:20). [14]ఉదాహరణకు, పస్కా సమయంలో పేదలకు ధర్మం చేయడం ఒక లక్షణమై యున్నట్టు అనేకమంది పండితులు అంటారు (మత్తయి 19:21; లూకా 14:13 చూడు). [15]ద్వితీయో. 15:11. [16]పేదలకు ఉపకారం చేయుమని దేవుడు కోరుతున్నారు (సామె. 19:17; గలతీ. 2:10). [17]తమకున్న సమయంలో యోసేపు నీకొదేములు చేయగలిగినదంతా చేశారు (యోహాను 19:38–40). వారి పని పూర్తిగా ముగించకయే వదలినట్టున్నారు. లూకా 23:53–24:1 యొక్క ప్రాధాన్యత అదియేనేమో. [18]తన పని మీద ఈ మాటల్లో గొప్ప విశ్వాసం వ్యక్తమయింది. ప్రభువు తన సమాధిని గూర్చి. సువార్త లోకమంతా ప్రకటింపబడడాన్ని గూర్చి మాట్లాడినప్పుడు, పునరుత్థానం ఖాయమని సూచించారు. [19]Banowsky, 23-26 నుండి ఈ మూడు పాయింట్లు సేకరింపబడ్డాయి. [20]యూదాతో అనేక శిష్యులు ఏకీభవించారు కాని, విమర్శించుటలో యూదా నడిపించాడు.

[21]అనేకమైన ఉదాహరణలు జ్ఞాపకం వస్తుంటాయి, బహుశ నీకు కూడ కలుగవచ్చు. [22]నేను నివసిస్తున్న ప్రాంతంలోని క్రైస్తవ కళాశాలను చూపవచ్చు. [23]సంఘమునకు ఎలాగు అన్వయించుకోవచ్చో ముందుగా చెప్పిన ఈ రెండు వాక్యాలు ఉదహరిస్తాయి. నీకు అనుకూలమైన రూపంలో వీటిని ఉపయోగించు. [24]ఈ ఉదాహరణ, దీని తరువాతది Banowsky నుండి వచ్చింది, 24–25. [25]William Barclay, *The Gospel of Matthew*, vol. 2, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 330. [26]నీకు తెలిసిన రెండు ఉదాహరణలను తెలుపు. బైబిలు తరగతిలో ఈ పాఠం చెప్పిన యెడల పాల్గొన్నవారిని ఈ విషయం పై వారి అభిప్రాయాలను పంచుకోమని చెప్పు.